పింఛన్ల పంపిణీలో అవినీతి



బెజ్జూర్: దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వృద్ధులకు ఆసరా కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నెల పెన్షన్ అందజేస్తుంది. అయితే పెన్షన్లు పంచడంలో బీపీఎంలు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నెలకు రూ.8 లక్షలకు పైగా, ఏడాదికి రూ. కోటి 48 లక్షలకు పైగా అవినీతి జరుగుతున్నా.. అవినీతి విషయంలో లబ్ధిదారులు ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

పింఛన్ పంపిణీలో అక్రమాలు..

జిల్లాలో ఆసరా పెన్షన్ పంచడంలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. పెన్షన్ పంచే బ్రాంచ్ పోస్టుమాస్టర్‌లు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో 15 మండలాలు, 334 గ్రామపంచాయతీల పరిధిలో ఆసరా పెన్షన్ల లబ్ధిదారులు 54,589 మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.12,76,65,936 రాష్ట్ర ప్రభుత్వం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా పోస్టల్ శాఖకు అందజేస్తుంది. బ్రాంచ్ పోస్టుమాస్టర్ల ద్వారా ప్రతీనెల 1వ తేదీన లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో వృద్ధులు 23,253 మంది, దివ్యాంగులు 5858 మంది, గీత కార్మికులు 133 మంది, ఒంటరి/ వితంతువులు 21,612 మంది లబ్ధిదారులు పెన్షన్ పొందుతున్నారు. కాగా బ్రాంచ్ పోస్టుమాస్టర్లు 54,589 మంది పెన్షన్‌దారులకు రూ.16 చొప్పున లబ్ధిదారులకు చెల్లించడం లేదు. ఈ విధంగా నెలకు రూ.8,73,424లు బీపీఎంలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఈ విధంగా లెక్కిస్తే సంవత్సరానికి రూ.1కోటి48 లక్షలకు పైగా అనధికారికంగా లబ్ధిదారుల నుంచి బ్రాంచ్ పోస్టుమాస్టర్లు అక్రమంగా అర్జిస్తున్నారు. ఈ విషయంపై పలు గ్రామాల నుంచి పెన్షన్ లబ్ధిదారులు జిల్లా ఉన్నతాధికారులకు, మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. బీపీఎంల వద్దకు రాలేని పెన్షన్ లబ్ధిదారుల వద్దకు బ్రాంచ్ పోస్టుమాస్టర్లు వెళ్లి పెన్షన్ అందజేస్తున్నారు. ఇందుకు గాను అదనంగా రూ.100 నుంచి రూ.200 అక్రమంగా వసూలు చేస్తున్నారు. లబ్ధిదారులకు పంచుతున్న పెన్షన్లలో రూ.16లు మినహాయించుకుని ఇస్తున్నారు. ఇలా మినహాయించుకున్న డబ్బులు కూడా చెల్లించాలని లబ్ధిదారులు కోరితే వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

బెజ్జూర్‌లో..

గత కొన్ని నెలలుగా బెజ్జూర్ బ్రాంచ్ పోస్టుమాస్టర్ వితంతువులు, గీత కార్మికులు, ఒంటరి మహిళలకు ప్రతీనెల అందించే పెన్షన్‌లో రూ.2వేలు మాత్రమే ఇస్తూ రూ.16లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అలాగే లబ్ధిదారులు రూ. 16లు కూడా ఇవ్వాలని అడిగితే ఇవ్వకుండా దురుసుగా ప్రవర్తిస్తున్నారని పలువురు పింఛన్ లబ్ధిదారులు వాపోతున్నారు

రూ.2వేలు మాత్రమే ఇస్తున్నారు..



గత కొన్ని నెలలుగా పింఛన్ డబ్బుల్లో రూ.2వేలు మాత్రమే ఇస్తున్నారు. రూ.16 లు ఇవ్వమని అడిగితే ఇవ్వడం లేదు. అధికారులు స్పందించి రూ.16లు అందరికీ అందే విధంగా చర్యలు తీసుకోవాలి.

– చటారి నారాయణ, ఎలుకపెల్లి

అవినీతికి పాల్పడుతున్నారు



పింఛన్ పంపిణీలో పోస్టుమాస్టర్లు రూ.16 ఇవ్వకుండా అవినీతికి పాల్పడుతున్నారు. ఎందుకు ఇవ్వరని అడిగితే దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పోస్టుమాస్టర్‌పై చర్యలు తీసుకోవాలి.

– మొహమ్మద్ సలీముల్లా ఖాన్, బెజ్జూర్

మొదలైన ధాన్యం సేకరణ

సాక్షి ఎఫెక్ట్..

చింతలమానెపల్లి: గత వారం రోజులుగా మిల్లర్ల కారణంగా మండలంలో వరి ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో రైతులు నానాఇబ్బందులు పడ్డారు. తుపాను నేపథ్యంలో ఆందోళనకు గురయ్యారు. దీంతో వీరు పడుతున్న ఇబ్బందులపై 'నిలిచిన ధాన్యం కొనుగోళ్లు' శీర్షికన సాక్షిలో బుధవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు రవీంద్రనగర్, చింతలమానెపల్లి వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుల నుంచి ధాన్యం సేకరించేందుకు చర్యలు తీసుకున్నారు. వంజిరిలోని రైస్‌మిల్లుకు వరిధాన్యం పంపించాలని డీఎస్‌వో వినోద్ ఆదేశాలు ఇచ్చారు. ధాన్యం తూకం వేసి సేకరించిన ధాన్యం లోడ్‌ను రైస్‌మిల్లులకు పంపిస్తున్నట్లు కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి తాజిమ్ హుస్సేన్ తెలిపారు.



రవీంద్రనగర్ కేంద్రంలో వరిధాన్యం కొనుగోలు చేస్తున్న సిబ్బంది

'పౌష్టికాహారం అందించడంలో విఫలం'

తిర్యాణి: గురుకులాలు, వసతి గృహాల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్ గురుకులాల బాట కార్యక్రమ జిల్లా ఇన్‌చార్జి ఎండీ ముస్తఫా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలతో పాటు గిరిజన గురుకుల పాఠశాలలను తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలలో ఆలుగడ్డలు పొట్టు కూడా తీయకుండా వండటంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం చెలిమల ఆశ్రమ పాఠశాల సందర్శనకు వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, మాజీ సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుణవంత్ రావు, మాజీ ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, మాజీ జెడ్పీటీసీ కమల, బాధిరావు, మధుకర్, లచ్చన్న, సరిత, రమేశ్, హరీశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



ఆలుగడ్డలను పరిశీలిస్తున్న నాయకులు

రుణాలు రికవరీ చేయాలి

కౌటాల: మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యుల నుంచి వంద శాతం రుణాలు రికవరీ చేయాలని డీఆర్‌డీవో దత్తారావు అన్నారు. బుధవారం కౌటాల ఐకేపీ కార్యాలయాలన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బకాయి రుణాలను వసూలు చేసి సభ్యులకు తిరిగి రుణాలు ఇవ్వాలన్నారు. లక్ష్యం మేరకు మహిళ సభ్యులకు రుణాలు ఇచ్చి వారికి ఉపాధి కల్పించాలని తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ నమోదును ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఏపీఎం ముక్తేశ్వర్, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీవో దత్తారావు

కొత్తగా ఉద్యోగం సాధించిన వైద్యురాలికి సన్మానం

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని షిమ్లానగర్ కాలనీకి చెందిన దుర్గం శివరాం కుమార్తె దుర్గం పల్లవి ఎంబీబీఎస్ వైద్యవిద్యను పూర్తి చేసుకుని ఇటీవల ప్రభుత్వ వైద్యురాలిగా ఉద్యోగం సాధించింది. దీంతో బుధవారం సిర్పూర్(టి) మండల బీజేపీ నాయకులు ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిర్పూర్(టి) ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యనభ్యసించి ఉచితంగా సీటు సాధించి ఎంబీబీఎస్ వైద్యవిద్యను పూర్తి చేయడమే కాకుండా ప్రభుత్వ వైద్యురాలిగా ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సులిగొండ మహేశ్, జావిద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంతుల్లో ఎంపీడీవో కార్యాలయం



కెరమెరి: ప్రజాపాలన విజయోత్సవాలు పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం విద్యుత్ కాంతులతో కళకళలాడుతుంది. కార్యాలయం చుట్టూ రంగురంగుల లైటింగ్‌లు అమర్చడంతో రాత్రిపూట విద్యుత్ కాంతుల్లో మెరుస్తుంది.

కవి మాడిశెట్టి శ్రీనివాస్‌ను సన్మానించిన కలెక్టర్



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న వెంకటేష్ దోత్రె

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో కార్యాలయంలో కార్యాలయం సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న కవి మాడిశెట్టి శ్రీనివాస్‌ను జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రె తన కార్యాలయంలో శాలువాతో సత్కరించి అభినందించారు. కవి శ్రీనివాస్ రచించిన 'నువ్వు నేను గోదారి' అనే పుస్తకాన్ని డిపో మేనేజర్ విశ్వనాథ్‌తో కలిసి కలెక్టర్‌కు అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



డ్రంకెన్‌డ్రైవ్ పరీక్ష నిర్వహిస్తున్న ఎస్సై

బెజ్జూర్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు లేనివారికి జరిమానాలు విధించారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆటో, క్యాబ్, టాక్సీ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ఈనెల 7వ తేదీన తలపెట్టిన ఒక్కరోజు సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను డ్రైవర్లతో కలిసి ఆవిష్కరించారు. నాయకులు చిరంజీవి, లక్ష్మణ్, బాలాజి, ప్రవీణ్, ఫిరోజ్‌ఖాన్, అస్లాం ఖాన్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

పులి సంచారంపై వదంతులు

కౌటాల: మండలంలోని గుండాయిపేట గ్రామ శివారులో పులి సంచరిస్తుందని బుధవారం వదంతులు రావడంతో ప్రజలు ఆందోళన చెందారు. చేలకు వెళ్తున్న రైతులు పులిని చూసినట్లు తెలుపడంతో గ్రామస్తులు, అటవీశాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కౌటాల ఎఫ్ఎస్‌వో తులసీదాస్ నాయక్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి పులికి సంబంధించిన పాద ముద్రలు, ఆనవాళ్లు లేవన్నారు. దీంతో సమీప గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రాణహిత ప్రాజెక్టును వార్ధా నది వద్ద నిర్మిస్తాం

• ఎమ్మెల్సీ దండే విఠల్

బెజ్జూర్: ప్రాణహిత చేవెళ్ల అంబేద్కర్ సుజల స్రవంతి ప్రాజెక్టును వార్ధా నది వద్ద నిర్మిస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేయాలని, ప్రత్యేక ప్యాకేజీ కోసం ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేక నిధులకు ఇబ్బంది అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 60శాతం నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును నిర్మించాలని డిమాండ్ చేశారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

కౌటాల: గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. బుధవారం వీరవెల్లి, శీర్షా గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు ఆయన భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలు కల్పించి వాటిని అభివృద్ధి చేస్తామన్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, నాయకులు దామోదర్, గోపాల్, జగ్గగౌడ్, నాహీం, గట్టయ్య, వినోద్ తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

బెజ్జూర్: సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్‌లు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 73 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను అందజేశారు. తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీవో గౌరీ శంకర్, మాజీ జెడ్పీచైర్మన్ గణపతి, పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాశ్, టీపీసీసీ మెంబర్ అర్షద్ హుస్సేన్, మాజీ సర్పంచ్ జగ్గా గౌడ్, మాజీ ఎంపీపీ నానయ్య తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో కల్యాణలక్ష్మి పథకం లబ్ధిదారులకు బుధవారం చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్‌లు 78 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. తహసీల్దార్ మునావర్ షరీఫ్, సహకార సంఘం వైస్‌చైర్మన్ టోంబ్రె మారుతి, మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ ఎంపీపీలు డుబ్బుల నానయ్య, విశ్వనాథ్ బసార్కర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.



బెజ్జూర్: లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ విఠల్

అటవీశాఖ అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలి

సిర్పూర్(టి): అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. బుధవారం సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని భూపాలపట్నం గ్రామంలో నూతనంగా నిర్మించిన సెక్షన్ అధికారి క్వార్టర్‌ను ఆయన ప్రారంభించారు. జిల్లా అధికారి నీరజ్ కుమార్, ఎఫ్ఆర్‌వో ఇక్బాల్ హుస్సేన్, నాయకులు సోహెల్ అహ్మద్, కిషోర్, అఖిల్ అహ్మద్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బీట్ అధికారి క్వార్టర్ ప్రారంభించిన ఎమ్మెల్సీ

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని అటవీ శాఖ బీట్ అధికారి క్వార్టర్‌ను బుధవారం ఎమ్మెల్సీ దండే విఠల్ అటవీశాఖ జిల్లా అధికారి నీరజ్‌కుమార్ టిబ్రివాల్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడవుల సంరక్షణలో అటవీ అధికారుల తీరును అభినందించారు. అంతకుముందు ఎమ్మెల్సీని అధికారులు శాలువాతో సన్మానించారు. ఎఫ్ఆర్‌వో అనిల్ కుమార్, నాయకులు అర్షద్ హుస్సేన్, సముద్రాల రాజన్న, సిడాం గణపతి, జగ్గాగౌడ్, చంద్రమౌళి, రాచకొండ కృష్ణ, సుధాకర్, రాజు, శంకర్‌గౌడ్, ఇలియాస్ పాల్గొన్నారు.

'ప్రాణహిత'లో వాటా ఇవ్వడానికి కేంద్రం సిద్ధం

చింతలమానెపల్లి(సిర్పూర్): ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటే.. నిధుల్లో కేంద్రం వాటా ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే దండె విఠల్‌తో హాజరై పలు అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ హయాంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కల్యాణలక్ష్మి వంటి పథకాల చెక్కులు పంపిణీ చేయడానికి మాత్రమే పరిమితమయ్యే పరిస్థితి ఉందన్నారు. అటవీ అనుమతులకు అవసరమైన రూ.12కోట్లు ప్రభుత్వం కేటాయించకపోవడంతో నియోజకవర్గంలో పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని, ఉమ్మడి ప్రభుత్వంలో అయినా సకాలంలో బిల్లులు వచ్చేవని ఎద్దేవా చేశారు. ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం ప్రభుత్వం తరఫున నిధులు ఇప్పించే బాధ్యత తీసుకుంటానని స్పష్టం చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

బెజ్జూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మెరుగైన భోజన, వసతి కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచి చూసి పలు సూచనలు చేశారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడారు. చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలని ఆకాంక్షించారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

బెజ్జూర్: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని అటవీశాఖ అధికారులు అన్నారు. ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వన్యప్రాణులను రక్షిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ర్యాలీ ప్రధాన వీధుల గుండా సాగింది. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో అబ్దుల్ ముజావీర్, డీఆర్‌వో శ్రావణ్, ఎఫ్ఎస్‌వో సంతోష్, మల్లికార్జున్, బీట్ అధికారులు, టైగర్ ట్రాకర్లు పాల్గొన్నారు.

కెరమెరి: వన్యప్రాణులను రక్షించి పర్యావరణాన్ని కాపాడుదామని ఎఫ్ఆర్‌వో మజరోద్దీన్ అన్నారు. ప్రపంచ వన్యప్రాణులు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అటవీ అధికారులు నాగేశ్వర్ గౌడ్, విజయ్‌కుమార్, లాల్‌మానాయక్, స్రవంతి, నజీర్‌అలీ, నర్సయ్య, రామయ్య, బూమేశ్, వందన తదితరులు ఉన్నారు.

రెబ్బెన: వన్యప్రాణులను వేటాడినా, వాటికి ముప్పు కలిగించిన కఠిన చర్యలు తప్పవని రెబ్బెన ఫారెస్టు రేంజ్ అధికారి నిజామోద్దీన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. పులి కనిపిస్తే ఎలాంటి హాని కలిగించకుండా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. డిప్యూటీ ఆర్వో భానేశ్, సెక్షన్ అధికారి బాబు, బీట్ అధికారులు దేవేందర్, సద్దాం, వెంకటేశ్, తిరుపతి, సురేందర్, స్వాతి, శ్రీలత, ఉషారాణి, అష్మాలు పాల్గొన్నారు.

తిర్యాణి: వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని గిన్నెదరి రేంజ్ అధికారి సరోజరాణి అన్నారు. బుధవారం వన్యప్రాణి పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ రేంజ్ అధికారి ఇక్బాల్, సెక్షన్ అధికారులు ఆత్రం రవీందర్, బీమ్లా నాయక్, ఉజ్వల్ ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సిర్పూర్(టి): ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవాన్ని బుధవారం మండలకేంద్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ సిబ్బంది

క్లుప్తంగా

మావోయిస్టులకు సహకరించొద్దు



రావులపల్లిలో మాట్లాడుతున్న ఎస్సై రాజు

దహెగాం: మారుమూల గ్రామాల ప్రజలు మావోయిస్టులకు సహకరించొద్దని ఎస్సై కందూరి రాజు అన్నారు. మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. బుధవారం ప్రాణహిత పరీవాహక సమీపంలో ఉన్న రావులపల్లి గ్రామంలో ఇళ్లలో సోదాలు నిర్వహించారు. గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చారా అని ఆరా తీశారు. గ్రామ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. యువత ఐక్యంగా ఉండి గ్రామాభివృద్ధికి పాటు పడాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. గ్రామాల్లోకి అపరిచిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీకాంత్

ఆసిఫాబాద్‌అర్బన్: రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు, యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్ వద్ద యువతకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఆన్‌లైన్ ఆర్థిక మోసానికి గురైతే వెంటే 1930కి కాల్ చేయాలన్నారు. అపరిచితులకు ఓటీపీ షేర్ చేయరాదని సూచించారు. పోలీసు సిబ్బంది, యువత పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండల ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క రూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

'అందరికి చదువు రావాలి'



విద్యార్థులతో చదివిస్తున్న ఎంఈవో

కెరమెరి: విద్యార్థులకు చదవడం, రాయడం రావాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. బుధవారం మండలంలోని ఇందాపూర్, నిసాని పాఠశాలలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌తో పాటు ఎండీఎం, సీసీఈ, టీచర్స్ డైరీ తదితర రికార్డులను నమోదు చేయాలన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

బెజ్జూర్: మండలంలోని గోల్కొండ గ్రామానికి చెందిన మోయిజ్, ఇర్షాద్, జాహిర్ హుస్సేన్‌లు ఇటీవలే సోమిని గ్రామం వద్ద ప్రాణహిత నదిలో మునిగి మృతిచెందారు. కాగా బుధవారం సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

తిర్యాణి: వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో సీతారాం అన్నారు. బుధవారం మండలంలోని చెలిమల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలోని రిజిస్టర్లను తనిఖీ చేశారు. డీడీవో సిద్ధార్థ, వైద్యులు కృష్ణ, శ్రీవాణి, పల్లవి, సుప్రియ ఉన్నారు.

పాఠశాలల్లో పరిశుభ్రత పాటించాలి

రెబ్బెన: పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాలను సిద్ధం చేయాలని డీఈవో యాదయ్య అన్నారు. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎన్ఏఎస్ 2024 టెస్ట్‌లో భాగంగా బుధవారం మండలంలోని గంగాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు తయారు చేసేందుకు పాఠశాలలో నిల్వ ఉన్న బియ్యంతో పాటు సరుకులను పరిశీలించారు. ఎంపీపీఎస్ హెచ్ఎం రవిప్రసాద్, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం లతీఫ్‌లు ఉన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలపై బుధవారం మోతుగూడ, అడ, బాబాపూర్ గ్రామాల్లో కళాబృందం ఆధ్వర్యంలో గ్రామస్తులకు పాటల రూపంలో అవగాహన కల్పించారు. రాందాస్, సతీశ్, లలిత, రవి తదితరులు పాల్గొన్నారు.